# కార్తికేయ సన్నాఫ్ కార్తికేయ

ఆ గదిలో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. తెల్లటిగదిగోడలమీద పరుచుకున్న తెల్లటి ట్యూబ్‌లైట్ల కాంతి. రివాల్వింగ్ చైర్‌లో నడుం వెనక్కివాల్చి కూర్చున్న డాక్టర్ భానుమూర్తి తదేకదీక్షతో తన చేతిలోని మెడికల్ రిపోర్టులను పరిశీలిస్తున్నాడు. ఆయన ఎదురుగా యాభయ్యేళ్ళ వయసున్న వ్యక్తి. తెల్లటి లాల్చీపైజమా, కొద్దిగా పెరిగిన గడ్డం.

"సార్ చాలామంది డాక్టర్లను కలిశాను. ధైర్యం చెపుతున్న వాళ్ళు తక్కువ. మూడునెలలు గడిచిపోయాయి! మీ గురించి విన్నాను. డాక్టర్ భానుమూర్తి చెయ్యివేస్తే చనిపోయినవాళ్ళూ తిరిగి లేస్తారంటారు. ఏదో ఆశ మెల్లగా, ఆ గదిలోని నిశ్శబ్దం భగ్నంచేస్తూ ఆయన.

ఆయన తలెత్తి ఆవ్యక్తి వంకచూస్తూ, "పాపం మీ టెన్షన్ మీకుంది. మేడమీదనుంచి క్రిందపడి కోమాలోకి వెళ్ళిన మీ అబ్బాయి ఇంకా స్పృహలోకి రాలేదనే మీ ఆందోళన. కంగారుపడకండి, మీ అబ్బాయి తొందరలో కోలుకుంటాడు. అయితే ప్రమాదం జరిగినతీరు గురించే నా అనుమానం" అంటూ ఆయన చెప్పడం ఆపాడు.

ఆయన మాటలకు ఆ వ్యక్తి తలెత్తి చూసి మళ్ళీ తలదించుకున్నాడు. "ప్రమాదం జరిగిన అరగంట వరకూ మీ అబ్బాయి స్పృహలోనే ఉన్నాడు పిట్టగోడమీద కూర్చుని చదువుకొంటూ పడిపోయానని ముందుగా వైద్యం చేసిన డాక్టరు గారికి చెప్పాడు. కేస్‌షీటులో ఆయన అదే రాసారు. మీ అబ్బాయి ముందుకు బోర్లాపడినట్టుగా నుదురుకు, రిబ్స్‌కు బలంగా గాయాలు తగిలాయి." అంటూ ఆయన రిపోర్టుల్లోకి మళ్ళీ తలదూర్చారు.

నిమిషం తర్వాత ఎదురుగా ఉన్న వ్యక్తి వంక పరిశీలనగా చూసి "మిమ్మల్ని ఇదివరకూ చూసినట్టు గుర్తు!" అన్నాడు భానుమూర్తి.

ఆ మాటలకు చలనం లేదు. నిర్లిప్తంగా ఉన్నాడు. డాక్టరు గారే మళ్ళీ నోరువిప్పి, "ఔను నా అంచనా కరక్టే. సంవత్సరం క్రితం మిమ్మల్ని కలిసాను. అప్పటి మీ గెటప్ వేరే. సఫారీడ్రెస్, రేబాన్ కళ్ళద్దాలు, మెడలో గొలుసు, చేతికి బ్రాస్‌లెట్‌తో హుందాగా కనిపించారు. మరిపుడు సాధువులా ఉన్నారు. పాపం కొడుక్కి జరిగిన ఘోరప్రమాదంగురించి ఇలా అయి పోయారా?" అంటూ ఆయన ఆ వ్యక్తి వంక పరిశీలనగా చూసారు.

ఆ మాటలకూ ఆ వ్యక్తి ముఖంలో ఏ భావమూ లేదు. - రెండు నిమిషాలు ఆలోచనలో పడ్డ డాక్టర్ భానుమూర్తి గదిలో అటూఇటూ తిరుగుతూ-

"చూశారా, ఈ అరవయ్యేళ్ళ వయసులో ఎంత మతిమరుపో, మేలు చేసిన వాళ్ళను మరచిపోయాను.. ఔను మీరు నాకు చాలా సహాయం చేసారు. రెండేళ్ళక్రితం నా ఇంటిస్థలం గొడవల్లో వుంటే, ఆ సమస్య మీరే పరిష్కరించారు. మీ దయవల్ల ఇల్లుకట్టుకుని సుఖంగా వున్నాను అప్పుడు మీకు నేనిచ్చింది తక్కువే! అంతటి సహాయం చేసిన మీరు ఒక అపరిచితుడిలా నా దగ్గరకు రావడం ఏమీ బాగోలేదు. మీరొక జిల్లాస్థాయి అధికారి. ఇలా అనామకంగా అప్పాయింట్‌మెంట్ తీసుకొని, గంటసేపు నాకోసం నిరీక్షించడం ఏమిటి?" అన్నాడాయన. మాటలకు సమాధానం చెప్పకుండా తలొంచుకుని ఆలోచిస్తూ ఉండిపోయాడు ఆ వ్యక్తి భానుమూర్తికి విసు గొచ్చింది. తను అంతసేపు మాట్లాడినా నోరు విప్పడేమిటి? ఏమయ్యింది ఈ వ్యక్తికి, కొడుకుకున్నా ముందు ఇతగాడికి ట్రీట్‌మెంట్ ఇవ్వాలి కాబోలు అనుకుంటూ, ఆ వ్యక్తి కళ్ళలోకి సూటిగా చూశాడు

"ఏమిటో, మీరు మౌనయోగంలోకి వెళ్ళిపోతున్నారు.. ప్రమాదం జరిగిన తీరు గురించి నాకు తెలియాలి కదా! మీరేమైనా చెపితేనే కదా నాకు తెలిసేది. మీ అబ్బాయి మళ్ళీ మనలోకి వస్తాడు. మరింత డిప్రెషన్‌కి గురి అయితే ఎలా? ధైర్యంగా వుండండి!" అన్నాడు.

ఆ వ్యక్తి ఒకసారి కళ్ళురుద్దుకున్నాడు. కళ్ళనించి నీళ్ళు జలజల రాలాయి.

డాక్టర్ భానుమూర్తి ఒక్కసారిగా కంగారుపడ్డాడు. "సారీ ... వద్దు లెండి... మీరు బాగా ఇబ్బందిపడుతున్నట్టున్నారు. మీరికవెళ్ళవచ్చును." అన్నాడు.

అయినా సరే అయన అక్కడినంచి కదిలే ప్రయత్నం ఏదీ చెయ్యలేదు. నిమిషం తర్వాత నోరిప్పాడు. "సారీ నన్ను క్షమించండి నా మౌనంతో మిమ్మల్ని బాధపెట్టినట్టున్నాను. గతం మరచిపోదామనుకున్నా నన్ను వెంటాడుతోంది. మీలాంటి వారికి చెపితే నాలోని అశాంతి తీరుతుందేమో!" అంటూ అతను ఒక్కసారి ఊపిరిపీల్చి వదిలాడు.

భానుమూర్తి ముందుకువంగి అతడివైపే దృష్టి నిలబెట్టారు.

అతను చెప్పడం ప్రారంభించాడు. "మన చిన్నప్పుడు తల్లులు, చంద మామరావే... జాబిల్లిరావే పాటలుపాడి పిల్లలకు అన్నం తినిపిస్తారు. తల్లులు రకరకాల కష్టాలుపడతారు. లంచం ఆశ చూపిస్తారు. పాపం, బిడ్డ ఆకలి తీరడంకోసం అదంతా చేస్తారు. నా చిన్నతనంలోనూ మా అమ్మ అలానే చేసిందట! నేను మరీ పెంకిఘటం కావడంతో తాయిలాలు లంచం ఆశ చూపించి భోజనం తినిపించేది. స్కూలు కెళ్ళిన తరువాత, మా నాన్న, మా అమ్మ చూపిన బాటలోనే నడిచాడు. మార్కులు బాగాతెచ్చుకో బూట్లూ, బట్టలూ కొంటాననే వాడు. డిగ్రీ ఫస్టుక్లాసులో పాసయితే స్కూటర్ కొనిస్తా నన్నాడు. అలా స్కూటరు సంపాదించాను. అందరి పిల్లల్లా నేనూ పెరిగినా, లంచం ఇస్తేనే ఏ పనయ్యినా చెయ్యాలి అనే బీజాలు నాకు చిన్నప్పుడే బలంగా నాటు కున్నాయి." అంటూ అతను చెప్పడం ఆపి మంచినీళ్ళు అడిగాడు. డాక్టర్ గారు తన టేబులుమీద మంచి నీళ్ళు సీసా అందించారు.

అయన గబగబా నీళ్ళుతాగి మళ్ళీ గొంతువిప్పాడు. “డిగ్రీ అయింది కదా. మంచి ఉద్యోగం సంపాదించు, కట్నం బాగా దొరుకుతుంది అన్నాడు మా నాన్న. అలా మా నాన్న చెప్పినట్టు కష్టపడి చదివి పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షపాసయ్యి గెజిటెడ్‌స్థాయి అధికారిగా ఉద్యోగం సంపాదించాను. బాగా కట్నం తీసుకుని పెళ్ళి చేసుకున్నాను. ఉద్యోగంలో జాయినయిన పాతికేళ్ళలో చాలా ప్రమోషన్లు పొంది. జిల్లాస్థాయి అధికారిగా పదోన్నతి సాధించాను. అయితే...” అతను చెప్పడం ఆపి భానుమూర్తిగారికి రెండుచేతులూ జోడించి “క్షమించండి. మీ టైము చాలా విలువైనది. నా సొదతో మిమ్మల్ని విసిగిస్తున్నానా.” అన్నాడు.

“పరవాలేదు. చెప్పండి!” అన్నాడు డాక్టర్ భానుమూర్తి. అతను మరోసారి సీసాలోని నీళ్ళు గుక్కెడుతాగి నోరువిప్పాడు.

“చిన్నతంలో ‘లంచం’ అనే బీజం నాటుకున్నప్పటినించీ దాన్ని పెంచి పోషించి మహావృక్షంగా మార్చి దాని నీడలో ఎన్నో ఆస్తులు కూడబెట్టాను అయితే నా ఒక్కగానొక్క కొడుకునీ నా అవినీతి జీవితం గురించి తెలీకుండా పెంచాను. చిన్నప్పటినుంచీ హాస్టల్లో వుంచి చదివించాను. నాలాగా వాడు లంచగొండిగా మారకూడదని కోరుకున్నాను. నీతి, నిజాయితీ, నైతికవిలువలు గురించి వాడికి పదే పదే చెప్పేవాడిని. అలా చెప్పడంలో మా అబ్బాయి దృష్టిలో నేనొక ఆదర్శపురుషుడిని అయిపోయాను. వాడు చిన్నప్పటినుంచీ స్కూల్లో డిబేటింగ్ పోటీలలో పాల్గొని, అవినీతినిర్మూలను గురించి, లంచగొండితనం గురించి ఉపన్యాసాలిచ్చేవాడు. అలాగే చదువు లోనూ రాణించాడు. ఇరవై రెండు సంవత్సరాలకే ఇంజనీరింగ్ పూర్తి అయ్యింది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఎన్ని అవకాశాలొచ్చినా ప్రజలకు నీతివంతమైన ఉద్యోగిగా అందుబాటులో ఉందామని ప్రభుత్వ ఉద్యోగిగా చేరాడు. ఉద్యోగంలో చేరిన

ఆరునెలల్లో మంచిపేరుతోపాటూ ఎంతో మంది శత్రువుల్ని కూడా సంపాదించు కున్నాడు. అయినా భయంలేకుండా తన వృత్తి ధర్మాన్ని నిజాయితీగా, నిబద్ధతతో చేసేవాడు.'' ఆయన చెప్పడం ఆపి ఒక్కసారిగా కళ్ళుతుడుచు కున్నారు.

''గతం గుర్తుచేసి మిమ్మల్ని బాధపెట్టినట్టున్నాను!'' అన్నారు డాక్టర్ భానుమూర్తి.

''ఫరవాలేదండీ. నా కొడుక్కి ట్రీట్‌మెంటు ఇస్తున్నారు వాడిని మీ చేతుల్లోపెడుతున్నాను. ఈ విషయాలన్నీ మీకు తెలియాలి..'' అంటూ ఆయన మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాడు. ''నిజం ఎంతకాలం దాగుతుంది? నా నిజస్వరూపం నా కొడుకు తెలుసుకునే రోజు సరిగ్గా నాలుగు క్రితం జరిగింది. ఆ రోజు మా అబ్బాయి ఒక పబ్లిక్‌మీటింగ్‌లో వేలాదిమంది జన సమూహం ఎదుట గళం విప్పాడు. నేనూ ఆ సమావేశానికి ముఖ్య అతిధిగా వెళ్ళాను.

''మనదేశాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్దరోగం లంచగొండితనం. మన దేశం ఎన్నో సంస్థల నివేదికప్రకారం అవినీతిమయ దేశాలజాబితాలో ప్రముఖంగా కనిపిస్తోంది. రాజకీయనాయకులనుంచి క్రిందిస్థాయి ఉద్యోగి వరకూ ఈ అవినీతి అంటూవ్యాధిలా వ్యాపించింది. అవినీతిపరుల్ని వీధి దీపాలకు వ్రేలాడతీస్తానన్నారు, మన నాయకులు ఒకరు. అయినా ఆయనకు ఒకరికి కూడా సాధ్యంకాలేదు. లంచం తీసుకోవడమేకాదు, ఇవ్వడమూ తప్పే. కొద్దిరోజుల్లో అయ్యేపని ఒక్కరోజులో అవ్వాలనుకోవడమే లంచగొండితనాన్ని ప్రేరేపిస్తోంది. మనదేశాన్ని నిర్వీర్యంచేస్తున్న లంచగొండి తనాన్ని రూపు మాపేందుకు యువత నడుంబిగించాలి. నా తుదిశ్వాసవరకూ దీనికి వ్యతిరేకంగా కృషిచేయడమే నా లక్ష్యం'' అంటూ ఉద్రేకంగా ప్రసంగించాడు.

ఆ సభలో ఒక ప్రేక్షకుడు లేచి, ‘‘బాబూ ఇంతగొంతు చించుకుని మాట్లాడుతున్నావ్! ఈ మాటలు మీ నాన్నకు ఎప్పుడైనా చెప్పావా? అవినీతి అధికారిగా ఆయన ఎన్ని ఆస్తులు సంపాదించాడో నీకు తెలుసా?’’ అన్నాడు

మా అబ్బాయి షాక్ తిన్నాడు. ఆ సభలోనే నన్ను అందరిముందు నిలదీసాడు.

‘‘నా మీద అనవసరంగా బురదజల్లుతున్నారు. ఇది అన్యాయం.’’ అంటూ గట్టిగా అరిచాను.

మా అబ్బాయి నా మాటలు పూర్తిగా నమ్మాడు. ‘మా నాన్నకు ఏ కళంకం ఆపాదించకండి ఆయన ఆదర్శవంతుడు. ఆయనేగనుక అవినీతి పరుడని మీరు నిరూపిస్తే నేను ప్రాణత్యాగం చేసుకుంటాను’ అంటూ సభా ముఖంగా ప్రకటించాడు.

‘‘వాడు అలా సభలో ప్రకటించగానే నేను భయ పడ్డాను. ఆ రోజునుంచీ అవినీతికి దూరంగా ఉండాలని ఒట్టేసుకున్నాను అవినీతి జీవితానికి స్వస్తి అనుకున్నాను, అయినా నా తత్త్వం మారలేదు. అన్నేళ్ళుగా అంటిపెట్టుకున్న ఆ జాడ్యాన్ని వదులుకోలేకపోయాను.’’ ఆయన చెప్పడం ఆపి ఒక్కసారిగా రెండుచేతులతో ముఖాన్ని కప్పుకున్నాడు

‘‘రిలాక్సవ్వండి... పాపం గతం తలుచుకుని కుమిలిపోతున్నారు. .... ప్లీజ్ రిలాక్సవ్వండి...’’ డాక్టర్ భానుమూర్తిగారి మాటలకు ఆ వ్యక్తి కళ్ళు తుడుచుకుంటూ తిరిగి చెప్పడం  మొదలుపెట్టాడు.

‘‘మా అబ్బాయికి నా అసలురంగు తెలిసిపోయింది. నా గురించి పూర్తి వివరాలు తెలుకున్నాడు. ‘అయిందేదో అయింది ఇకనించైనా ఆ పాపపు జీవితాన్నించి బయటపడండి, లేదంటే ఆరోజు సమావేశంలో నేను ప్రకటించిన

తీర్మానానికి కట్టుబడివుంటాను' అన్నాడు. నేను నా కొడుకు ముందు ఒట్టేసాను. ఇకనుంచి లంచంజోలికి వెళ్ళనని చెప్పాను. అయితే! అయన చెప్పడం ఆపి ఒక్కసారిగా శూన్యంలోకి చూసాడు తెల్లటికాంటి పరుచు కున్న ఆ గదిలో అతని ముఖం మరింత తెల్లగా పాలిపోయి కనిపించింది. పెదాలు వణుకుతున్నాయి.

"ప్లీజ్ రిలాక్స్... మంచినీళ్ళు తాగండి," అంటూ డాక్టర్ భానుమూర్తి అతడికి నీళ్ళసీసా అందించాడు.

అతను గుక్కెడు నీళ్ళు తాగి మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు, "వారం రోజులు కాలేదు. నేను నా కొడుక్కి మాటిచ్చి సరిగ్గా ఏడోరోజు అవినీతి నిరోధకశాఖ అధికారులకు లంచం తీసుకుంటూ దొరికిపోయాను. పేపర్లో ఫోటోలు టీవీలో స్క్రోలింగ్, అలా నా గురించి పూర్తిగా అందరికీ తెలిసి పోయింది, నేను వాడికిచ్చిన మాట తప్పినందుకు వాడు మాత్రం తన మాట నిలబెట్టు కున్నాడు. మీరు ఊహించింది నిజమే, మా రెండంతస్తుల భవనం పైనుంచి క్రిందికి దూకాడు. ప్రమాదవ శాత్తూ పడిపోయానని ముందుగా చికిత్స చేసిన డాక్టర్ గారికి చెప్పాడు. ఈ దౌర్భాగ్యపు తండ్రికి కళంకం రాకుండా వుండాలని అలా చెప్పాడు. మూడునెలలుగా కోమాలోవున్న వాడివంక చూడడానిక్కూడా నాకు ధైర్యం చాలడంలేదు. సార్!" ఆయన బావురు మన్నాడు.

ఆయనను సముదాయిస్తూ, డాక్టర్ భానుమూర్తి వెంటనే "బాధపడ కండి. సత్యం బతుకుతుంది. దానికి చావులేదు సత్యవ్రతుడైన నీ కొడుకు కార్తికేయ మళ్ళీ మనలోకి వచ్చేస్తాడు" అన్నాడు.

"థాంక్యూసార్! మీ మాటలు నాలో నమ్మకాన్ని పెంచుతున్నాయి..." అంటూ లేచాడు ఆయన.

మెడికల్ రిపోర్టు కాగితాలు అతడికి అందిస్తూ. "మీ పేరు శివరావు కదా! కార్తికేయ అని పడింది రిపోర్టులో, సరి చేసుకోండి అన్నాడు డాక్టర్. భానుమూర్తి.

"లేదుసార్ నా పేరు కార్తికేయ"

"అంటే మీ కొడుకు పేరూ... అదేనా!" అన్నాడు భానుమూర్తి.

"ఔనుసార్ నా పేరు మార్చుకుని నా కొడుకు పేరయిన కార్తికేయ అని పెట్టుకున్నాను, పిల్లలకు పెద్దవాళ్ళు పేర్లుపెడతారు. వారి అడుగు జాడల్లో నడిచి గొప్పవాళ్ళవు తారని అలా గుణంలో నాకంటే పెద్దవాడైన నా కొడుకు పేరు పెట్టుకున్నాను సార్. వాడిలోని ఒక్క లక్షణమైనా నాకు సంక్రమిస్తుందని... రిపోర్టులో వున్నపేర్లు కరక్టేసార్.... కార్తికేయ, సన్నాఫ్ కార్తికేయ" అలా అంటూ ఆ గది దాటి బైటకు వెళుతున్న అతని వైపు అభిమానంగా ఆశ్చర్యంగా చూస్తు ఉండి పోయాడు డాక్టర్ భానుమూర్తి.

(జాగృతి 19-9-2011)